సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 13 । జూన్ । 2024



మూగ జీవాల ఉసురు

వాహనాల్లో పరిమితికి మించి మూగజీవాలను ఎక్కించి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మణుగూరులో పోలీసులు పట్టుకున్నారు. 8లో



బ్యాంక్ ఎదుట ఆందోళన

తొమ్మిది నెలలుగా తిరుగుతున్నా బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వడం లేదంటూ రైతులు ఇల్లెందులో ఆందోళన చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ ప్రభావం అధికంగానే ఉంటుంది. రాత్రి కూడా ఉక్కపోత వాతావరణమే కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

అశ్వాపురం: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. నేడు ఉదయం 10 గంటలకు దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద సీతమ్మ సాగర్ బ్యారేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. అమెర్ద వద్ద ఉన్న సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్‌ను, అనంతరం బీజీ కొత్తూరు వద్ద ఫేజ్–1 పంప్‌హౌస్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం ములకలపల్లి మండలంలోని పూసుగూడెం చేరుకొని ఫేజ్–2 పంప్‌హౌస్‌ను పరిశీస్తారు. ఆ తర్వాత కమలాపురం వద్ద ఫేజ్–3 పంప్‌హౌస్‌ను సందర్శిస్తారు. పాల్వంచ, కొత్తగూడెం, జూలురుపాడు మీదుగా సాయంత్రం 5.30 గంటలకు ఏన్కూరు చేరుకొని సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తారు.

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా బేడా మండపానికి తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఐటీఐల్లో ప్రవేశ దరఖాస్తు గడువు 14 వరకు పెంపు

బూర్గంపాడు/భద్రాచలం టౌన్ : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14 వరకు గడువు పెంచినట్లు కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 14 ఏళ్లు నిండిన ఆసక్తి గల విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలను iti. telangana.gov.in వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

19 వరకు దరఖాస్తుల స్వీకరణ

కొత్తగూడెంరూరల్ : భద్రాచలంలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 19వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి, పిల్లల వైద్య నిపుణులైన వారు పార్ట్‌టైమ్ డాక్టర్ పోస్టుకు, పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన మహిళలు ఆయా పోస్టుకు, డిగ్రీ పూర్తి చేసిన వారు డేటా ఎనాలసిస్ట్, అకౌంట్స్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

భగీరథ పంప్‌హౌస్‌లో క్లోరిన్ గ్యాస్ లీక్..

- కార్మికుడికి అస్వస్థత

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల క్రాస్‌రోడ్ సమీపంలో గల మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో బుధవారం క్లోరిన్ గ్యాస్ లీకైంది. ఈ ఘటనలో పంప్‌హౌస్‌లో పని చేస్తున్న ఓ కార్మికుడు అస్వస్థతకు గురికాగా, భయంతో స్థానికులు పరుగులు తీశారు. వివరాలిలా ఉన్నాయి. పంప్‌హౌస్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న సీతానగరం గ్రామానికి చెందిన నల్లపు కళ్యాణ్ క్లోరిన్ గ్యాస్ సిలిండర్ మారుస్తుండగా గ్యాస్ లీకైంది. దీంతో గ్యాస్ అతడి నోరు, ముక్కులోకి వెళ్లగా ఉక్కిరిబిక్కిరై భయంతో బయటకు పరుగుతీశాడు. గ్యాస్ వాసన తీవ్రం కావడంతో సమీపంలోని వారంతా దూరంగా పరుగెత్తారు. ఈ ఘటనలో కళ్యాణ్‌కు వాంతులు కాగా, సమీపంలో ఉన్న నక్కా తిరుపతమ్మ అనే మహిళకు ఊపిరాడక తీవ్రమైన దగ్గు వచ్చి ముక్కు, నోటి నుంచి రక్తం కారింది. వీరిని హుటాహుటిన వైద్యశాలకు తరలించారు. గతంలోనూ ఇలాంటి ఘటన చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. తరచూ జరుగుతున్న గ్యాస్‌లీక్ ఘటనలపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

సీతమ్మ సాగర్ కష్టాలు వీడేనా?

సీతారామ ప్రాజెక్టులో పెను సవాళ్లు

- ఏడాదిగా నిలిచిన సీతమ్మసాగర్ నిర్మాణ పనులు
- పర్యావరణ అనుమతులపై ఎన్‌జీటీ ఆగ్రహం
- గతేడాది రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ
- నేడు మంత్రుల పర్యటనతో చిగురిస్తున్న ఆశలు

పనులు నిలిచిపోయిన సీతమ్మసాగర్ బ్యారేజీ..



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా చెబుతున్న సీతారామ ప్రాజెక్టులో కీలకమైన సీతమ్మసాగర్ నిర్మాణ పనులపై కొత్త ప్రభుత్వం నజర్ పెట్టింది. ఈ బ్యారేజీకి సంబంధించిన పర్యావరణ అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో గతేడాది కాలంగా పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. ఇటీవల ఎన్నికల కోడ్ ముగియడంతో జిల్లాకు చెందిన మంత్రులు సీతారామ ప్రాజెక్టు పురోగతిపై దృష్టి సారించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి బ్యారేజీ నిర్మాణ ప్రదేశం, పంప్‌హౌస్‌లు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లను పరిశీలించేందుకు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

ఎన్‌జీటీ ఆగ్రహం

పూర్తి స్థాయిలో పర్యావరణ అనుమతులు తీసుకోకుండా అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ పనులతో తాము నష్టపోతున్నామంటూ ప్రాజెక్టు నిర్వాసితులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌టీజీ)ను ఆశ్రయించారు. వారు సమర్పించిన వివరాలతో పాటు ఎన్‌జీటీ స్వయంగా ద్విసభ్య కమిటీని నియమించి పలు ఆధారాలు సేకరించింది. అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు ఎక్కడివక్కడే నిలిపేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు.. కేంద్ర పర్యావరణ శాఖ నుంచి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ (ఈసీ) రాకుండా నిర్మాణ పనులు ఎందుకు చేపట్టారో తెలపాలంటూ 2023 సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పందించేలోగా మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు తలెత్తడం, ఆ తర్వాత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కారణంగా దాదాపు ఎనిమిది నెలలుగా ఈ అంశం మరుగున పడింది. మరోవైపు ఎన్‌జీటీ ఆదేశాల కారణంగా పనులు నిలిచిపోయి ఏడాది దాటింది. ఇప్పటికే బ్యారేజీ నిర్మాణ పనులు 35 శాతం వరకు పూర్తయ్యాయి. కానీ ఎన్‌జీటీ ఆదేశాలతో పనులు ఆగిపోవడం వల్ల యంత్ర సామగ్రిని ఇతర ప్రాంతాలకు తరలించగా, కార్మికులు పని స్థలం నుంచి వెళ్లిపోయారు.

డీపీఆర్‌కు ఆమోదం?

సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణాలకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు గత మూడేళ్లలో సమర్పించిన డీపీఆర్‌కు పదే పదే కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అనుమతులు రాలేదు. అయినప్పటికీ నిర్మాణ పనులు ముందుకు నడిచాయి. అయితే గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో లోపాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులు ప్రారంభించాలంటే కచ్చితంగా కేంద్రం నుంచి ఈసీ క్లియరెన్స్‌తో పాటు డీపీఆర్‌కు అనుమతి సాధించాల్సి ఉంటుంది.

పనుల్లో వేగం పెంచాలి..

సీతారామ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పంప్‌హౌస్‌లు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మేరకు నిధుల మంజూరు, పనుల్లో వేగం పెంచడంపై దృష్టి సారించాలి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల్లో నీళ్లు నిలిపే అవకాశం లేనందున తాత్కాలిక చర్యగా జియోట్యూబ్‌ల ద్వారా వరద ప్రవాహానికి అడ్డుకట్ట వేసి అక్కడి నుంచి నీటిని తరలించాలని యోచిస్తున్నారు. ఇదే విధానాన్ని సీతారామకు అన్వయించి ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులకు త్వరగా మేలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలి. ఎందుకంటే ఇక్కడ బ్రిటిష్ హయాంలో నిర్మించిన దుమ్ముగూడెం ఆనకట్ట ఇప్పటికీ చెక్కుచెదరకుండా సేవలు అందిస్తోంది. ఈ బ్యారేజీలో నిలిచిన నీటిని ఎత్తిపోసేందుకు గల మార్గాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

అందుబాటులోకి వస్తే..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి అవసరాల కోసం రాజీవ్‌సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఈ రెండు ప్రాజెక్టులను రద్దు చేసి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సీతారామా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

బడి.. సందడి..



పాత కొత్తగూడెం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు



తోరణాలు, బెలూన్లతో ముస్తాబైన పాత కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాల

- పునః ప్రారంభమైన పాఠశాలలు
- తోరణాలు, అలంకరణలతో ముస్తాబు
- కలెక్టర్, ఎమ్మెల్యేల చేతులమీదుగా యూనిఫాం, పుస్తకాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: వేసవి సెలవుల అనంతరం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు కావడంతో ప్రభుత్వ పాఠశాలలను తోరణాలు, బెలూన్లతో అలంకరించారు. వేసవి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థులు కొంతమంది రాకపోవడంతో మొదటి రోజు హాజరు కొంత తక్కువగానే నమోదైంది. నూతనంగా ప్రవేశాలు పొందే విద్యార్థులతో పాటు అంగన్‌వాడీల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు వచ్చిన తల్లిదండ్రులతో స్కూళ్లలో సందడి నెలకొంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ ప్రియాంక ఆల, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

హాజరు అరకొరే..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,282 ప్రభుత్వ పాఠశాలలు వైభవంగా పునః ప్రారంభమయ్యాయి. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో కలిపి 61,319 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు 33,396 మంది హాజరయ్యారు. కలెక్టర్ ప్రియాంక ఆల పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, కొత్తగూడెం మండలాల్లోని పలు పాఠశాలలను సందర్శించారు. బడిబాట ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని పలు పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సందర్శించి విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను అందజేశారు. అలాగే ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆయా మండలాల్లో పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందుతోందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలతో ఆయా స్కూళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు.

అడ్మిషన్లు పెరుగుతున్నాయి..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని, దీంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయని డీఈఓ వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ విద్యతో పాటు పిల్లలకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా అందజేస్తున్నామని వివరించారు. సెలవుల్లో ఇళ్లకు వెళ్లిన హాస్టల్, గురుకుల, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు వెంటనే చేరుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి
- విద్యానగర్‌లో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ
- కొత్తగూడెంలో బడిబాట కార్యక్రమం ప్రారంభం



విద్యానగర్ కాలనీలో యూనిఫామ్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, జెడ్పీ చైర్మన్ కంచర్ల

పాల్వంచ/చుంచుపల్లి/కొత్తగూడెంరూరల్ : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా తమ పిల్లలను చేర్పించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాల్వంచ ప్రశాంత్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఆమె విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్కారు స్కూళ్లలో అనేక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో అలసత్వం వహించొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి పాఠశాల విశిష్టతను వివరించారు. ఆ తర్వాత చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తే ఫీజుల భారం తప్పదని, సర్కారు స్కూళ్లలో అయితే పిల్లలకు చదువుతో పాటు మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా అందుతాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన, నిష్ణాతులైన ఉపాధ్యాయులు పిల్లలకు బోధిస్తారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఆ తర్వాత కొత్తగూడెంలోని 16వ వార్డులో బడిబాట ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఈఓ వెంకటేశ్వరాచారి, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, పాల్వంచ తహసీల్దార్ వివేక్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, విద్యానగర్ ప్రత్యేకాధికారి పానెం కృష్ణ , ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, కొత్తగూడెం వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి, ప్రిన్సిపాల్ జరీనా తదితరులు పాల్గొన్నారు. కాగా, పాల్వంచ ప్రశాంత్ కాలనీలో తాగునీరు సక్రమంగా రావడం లేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా మున్సిపల్ డీఈ మురళిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని సూచించారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న సీఈఓ తదితరులు

బూర్గంపాడు: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా పరిషత్ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా మండల పరిధిలోని సోంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఆయన విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధిస్తారని, విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా అందిస్తారని అన్నారు. పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలపై మోజుతో చేర్పించి ఆర్థికంగా ఇబ్బంది పడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



తాగునీటి నల్లాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంట్రావు, పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడమే కాక ఉత్తమ విద్య అందిస్తోందని.. వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే, పీఓ బుధవారం పరిశీలించి సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులనే నియమించి వారి మానసిక స్థితిగతుల ఆధారంగా బోధించాలని తెలిపారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో స్పెషల్ ఆఫీసర్లను నియమించి సౌకర్యాలు, వసతులను మెరుగుపర్చామని, విద్యార్థులకు సరిపడా మంచాలు, డ్యూయల్ డెస్క్ బల్లలు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటుచేశామని తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కీంకు ఎంపిక

బెస్ట్ అవైలబుల్ స్కీంలో భాగంగా విద్యార్థుల ఎంపికకు ఐటీడీఏలోని పీఎంఆర్‌సీ భవనంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పీఓ డ్రా తీశారు. జిల్లాలోని గిరిజన బాలబాలికలు 699 మంది దరఖాస్తు చేసుకోగా మూడో తరగతిలో 61 మంది, ఐదో తరగతిలో 30 మంది, ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు 30 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఎంఈఓ సమ్మయ్య, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింహారావు, ఉద్యోగులు ప్రమీల భాయి, పార్వతి, లక్ష్మి సుభద్ర, రామకృష్ణారెడ్డి, ప్రసాద్, రంగయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు సకాలంలో రుణాలు..

భద్రాచలంటౌన్: గిరిజనులకు ట్రైకార్, ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు అందజేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ బ్యాంక్ అధికారులకు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన ఐటీడీఏ యూనిట్ అధికారులు, బ్యాంకర్లతో సమీక్షించారు. 2020–21, 2021–22ల్లో ట్రైకార్‌కు సంబంధించి 75 యూనిట్లను త్వరగా గ్రౌండింగ్ చేయాలని, ఎంఎస్ఎంఈ పథకం ద్వారా పెండింగ్ రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే, మారుమూల ప్రాంతాల ఆదివాసీ గిరిజన రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తున్నందున ధరణి, ఆర్ఓఎఫ్ఆర్, అసైన్స్ ఇలా ఏ పట్టా ఉన్నా పంట రునాలు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, ఏడీ భాస్కరన్, హెచ్ఎస్‌టీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కెనడాలో వర్క్ వీసాల పేరిట ఘరానా మోసం

- రూ.కోటి మేర పలువురికి టోకరా?
- వైరా పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ బాధితుడు

వైరారూరల్: కెనడాలో ఉద్యోగాలకు వర్క్ వీసాలు ఇప్పిస్తానని అమాయకులను నమ్మించి రూ.కోటి మేర కాజేసిన వ్యక్తి బాగోతం బయటపడింది. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని గన్నవరం గ్రామానికి దాదాపు 14 మంది సహా తల్లాడ, కల్లూరు మండలాల్లోని పలువురు వైరా మున్సిపాలిటీ పరిధికి చెందిన ఓ వ్యక్తికి నగదు చెల్లించినట్లు సమాచారం. ఇందులో ఓ బాధితుడు మంగళవారం రాత్రి వైరా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. గన్నవరం గ్రామానికి చెందిన బాధిత యువకుడు డిగ్రీ పూర్తిచేసి కూలీ పనులతో కుటుంబానికి ఆసరాగా ఉంటుండగా ఏడు నెలల కిందట వైరాకు చెందిన ఓ వ్యక్తి, ఆయన భార్య పరిచయమయ్యారు. తనకు కెనడాలో స్నేహితులు ఉన్నారని.. భార్యాభర్తలిద్దరు రూ.15లక్షలు చెల్లిస్తే వర్కింగ్ వీసాపై కెనడా వెళ్లొచ్చని నమ్మబలికాడు. దీంతో బాధిత యువకుడు, ఆయన భార్య పాస్‌పోర్ట్ తీయించి సదరు వ్యక్తిని కలవగా గతేడాది డిసెంబర్ 28న రూ.2లక్షలు తీసుకుని వీసా వచ్చాక మరో రూ.12 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. అయితే, పదిహేను రోజులకే ఫోన్ చేసి భార్యాభర్తలిద్దరికీ వర్కింగ్ వీసా వచ్చిందని విమాన చార్జీలకు రూ.3.70 లక్షలు ఇవ్వాలని సూచించాడు. తొలుత తానొక్కడినే వెళ్తానన్న యువకుడు రూ.1.85 లక్షలను చెల్లించి.. హైదరాబాద్ నుంచి కెనడా వెళ్లే విమానం ఎక్కగా ఫిబ్రవరి 28న అబుదాబీలో దిగాక ఇమిగ్రేషన్ అధికారులు పత్రాలను పరిశీలించి తప్పుడవని నిర్ధారించి హైదరాబాద్ పంపించేశారని బాధితుడు వాపోయాడు. ఈమేరకు సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే త్వరలో కెనడా పంపిస్తానని నమ్మబలికి ఫిబ్రవరి 29న మళ్లీ రూ.2,04,500 చెల్లించాలనగా బ్యాంకు ద్వారా నగదు బదిలీ చేశానని తెలిపాడు. అనంతరం మార్చి 4న హైదరాబాద్ నుండి కెనడా వెళ్తే అక్కడి విమానాశ్రయంలో అధికారులు పత్రాలు నకిలీవనీ చెప్పడంతో ఇండియా వచ్చేశానని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే, వర్కింగ్ వీసా పేరుతో విడతల వారీగా తీసుకున్న నగదు ఇవ్వాలని కోరితే సదరు వ్యక్తి బెదిరించాడని వైరా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు.

విద్యారంగానికి అవసరమైన మేర నిధులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి అవసరమైన మేర నిధుల కేటాయింపునకు సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం ఎన్నెస్పీకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేసి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలలు తెరిచిన రోజే దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసిన చరిత్ర తమదేనని తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. త్వరలో మెగా డీఎస్సీ ద్వారా సుమారు 10 వేల టీచర్ పోస్టుల భర్తీ చేయనున్నామన్నారు. ఖమ్మం కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.1.68 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు

వేసవి సెలవుల్లో రద్దీతో కానుల వర్షం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ హుండీ ఆదాయం 41 రోజులకు గాను రూ.1,68,54,129గా నమోదైంది. దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం చిత్రకూట మండపంలో లెక్కించగా ఈ మేరకు ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. అంతేకాక 117గ్రాముల బంగారం, 1,300 గ్రాముల వెండితో పాటు వివిధ దేశాల కరెన్సీ లభించింది. వేసవి సెలవులు కావడంతో ఏప్రిల్, మే నెలల్లోనే కాక ఈ నెలలో గత ఆదివారం వరకు భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనానికి వచ్చారు. అలాగే, హనుమాన్ జయంతి కూడా కావడంతో మాలధారులు విరమణకు రామయ్య సన్నిధికి చేరుకున్నారు. దీంతో భద్రగిరి నిత్యం రద్దీగా మారగా.. హుండీ ఆదాయం కూడా గణనీయంగా నమోదైంది. కాగా, మే 2వ తేదీన హుండీ లెక్కింపు జరగగా మళ్లీ 41 రోజులకు బుధవారం లెక్కించడంతో తక్కువ సమయంలోనే రూ.1,68,54,129 ఆదాయం సమకూరడం విశేషం.

వంద శాతం సబ్సిడీపై పండ్ల మొక్కలు

జూలూరుపాడు: రైతులకు పండ్ల మొక్కలను వంద శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు జూలూరుపాడు ఎంపీడీఓ డి. కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులందరూ అర్హులేనని పేర్కొన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా నిమ్మ, దానిమ్మ, జామ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలే కాక ఆయిల్‌పామ్ మొక్కలు, చెక్క తయారీ కోసం జామాయిల్ మొక్కలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాక పొలం గట్లపై నాటేందుకు కొబ్బరి మొక్కలు ఇస్తామని వెల్లడించారు. ప్రతీనెల మొక్కకు రూ.3నుంచి రూ.5 చొప్పున రెండేళ్ల పాటు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చు భరిస్తుందని తెలిపారు. పట్టాదారు పాస్ బుక్, పొలం చుట్టూ ఫెన్సింగ్, నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈజీఎస్ కార్యాలయంలో కానీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కానీ దరఖాస్తులు అందజేయాలని ఎంపీడీఓ సూచించారు.

కుటుంబ కలహాలు.. మరో పక్క నోటీసు

- మనస్తాపంతో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య


సముద్రాల సైదులు కృష్ణ (ఫైల్)

వైరారూరల్: వైరా మండలంలోని నారపునేనిపల్లికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన సముద్రాల సైదులు కృష్ణ(44) కొత్తగూడెం డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కొద్దిరోజులుగా కుటుంబ కలహాల కారణంగా గొడవ జరుగుతుండడంతో ఆయన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంతలోనే రెండు రోజుల క్రితం కృష్ణ విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నాడని ఆర్టీసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో మనస్తాపం చెంది సైదులు కృష్ణ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. పాపకొల్లు గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన సమాచారం తెలుసుకున్న ఎస్ఐ జీవన్ రాజు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని మండల కేంద్రంలోని రేషన్ దుకాణానికి పోలీసులు తరలించినట్లు తెలిసింది. ఈ విషయంపై వివరాలు చెప్పేందుకు పోలీసులు విముఖత వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

కొత్తగూడెంటౌన్: ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటనపై బుధవారం రాత్రి కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన చదలవాడ పవన్‌కల్యాణ్ పెయింటర్‌గా జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 10న పని ముగించుకుని వచ్చి సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

ములకలపల్లి: ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా భూమిలో చెట్లు నరికిన ఘటనలో బుధవారం కేసు నమోదైంది. అటవీశాఖ అధికారులు కథనం ప్రకారం.. మండల పరిధిలోని తిమ్మంపేట శివారు చలమన్ననగర్ బీట్‌లో కోత మిషన్ శబ్దాలు రావడంతో ఎఫ్‌బీఓ భాస్కర్, అటవీ సిబ్బంది గాలింపు చేపట్టారు. మారుజాతి చెట్లు నరికి పడేసినట్లు గుర్తించారు. ఘటనాస్థలిలో ఉన్న నూపా సరోజిని, నూపా కిరణ్‌లను విచారించగా, తమకు చెందిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాభూమిలో తామే చెట్లు నరికినట్లు తెలిపారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ హక్కు పత్రాలున్న భూముల్లో సేద్యం మాత్రమే చేయాలని, చెట్లు నరకకూడదని పేర్కొంటూ అధికారులు కేసు నమోదు చేశారు.





మూగజీవాల ఉసురు

- హైదరాబాద్‌కు తరలిస్తున్న 105 గోవులను పట్టుకున్న పోలీసులు
- నాలుగు వాహనాలు సీజ్, పశువులు గోశాలకు తరలింపు


కబేళాకు తరలిస్తుండగా పట్టుకున్న ఆవులు

మణుగూరు టౌన్: కొందరు అక్రమార్కులు మూగజీవాల ఉసురు పోసుకుంటున్నారు. పశువులను యథేచ్ఛగా కబేళాలకు తరలిస్తున్నారు. వాహనాల్లో హింసిస్తూ అపరిమిత సంఖ్యలో తీసుకెళ్తున్నారు. ఇలాంటి ఘటనే మణుగూరులో మంగళవారం రాత్రి జరిగింది. చర్ల, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి మణుగూరు మీదుగా అక్రమంగా నాలుగు వాహనాల్లో 105 పశువులను తరలిస్తుండగా పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి మణుగూరు వద్ద గోదావరి శివారు ప్రాంతాలకు చేర్చి, అక్కడి నుంచి హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి, కరెంట్ ఆఫీస్ వద్ద పశువుల వాహనాలను పట్టుకున్నారు. మణుగూరుకు చెందిన అహ్మద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనుమతి పత్రాలు లేకుండా కబేళాకు తరలిస్తున్న 105 పశువులను పట్టుకుని పాల్వంచ, తొర్రూరు గోశాలలకు తరలించామని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. కోదాడ, హైదరాబాద్, మణుగూరు, మోరంపల్లి బంజరుకు చెందినవారు ముఠాగా ఏర్పడి గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, నాలుగు వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేశామని తెలిపారు.

టేకులపల్లిలో 30 పశువులు..

టేకులపల్లి: బూర్గంపాడు మండలం జింకలగూడెం నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో 30 పశువులను తరలిస్తుండగా తడికలపూడి క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పశువులను పాల్వంచలో గోశాలకు తరలించి, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవూఫ్ తెలిపారు.

తక్కువ ధరకు విక్రయిస్తున్నాడని..

చికెన్ షాపు వర్కర్‌పై దాడి


దాడిలో తీవ్రంగా గాయపడిన వర్కర్ శ్రీనివాసరావు

అశ్వారావుపేటరూరల్: చికెన్ కేజీ ధర తగ్గించి ఉన్న బోర్డు తొలగించలేదని, తాము చెప్పినట్లు వినడం లేదనే కారణంగా ఓ షాపులో పని చేసే వర్కర్‌పై దాడికి పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం..మండల కేంద్రంలోని భద్రాచలం రోడ్‌లో ఉన్న ఓ చికెన్ షాపు యాజమాని కొద్ది రోజులుగా ధర తగ్గించి కేజీ చికెన్ రూ.200కే విక్రయిస్తున్నాడు. ఇదే విషయం బోర్డుపై రాసి పెట్టాడు. మిగిలిన దుకాణదారులు మాత్రం కేజీ చికెన్ రూ.280 విక్రయిస్తున్నారు. కాగా చికెన్ షాపుల యజమానుల యూనియన్ అధ్యక్షుడు దామరచర్ల హేమంత్, మరో నలుగురు కలిసి ధర తగ్గించి విక్రయాలు చేస్తున్న చికెన్ షాపు దగ్గరకు వెళ్లి బోర్డు తొలగించాలని వర్కర్ గోళ్ల శ్రీనివాసరావుకు చెప్పా రు. దీంతో తాను యజమాని చెప్పినట్లే విక్రయాలు చేస్తున్నానని, తాను బోర్డు తొలగించనని శ్రీనివాసరావు పేర్కొనగా, వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో యూనియన్ అధ్యక్షుడితోపాటు మరో నలుగురు వ్యక్తులు వర్కర్‌పై దాడి చేశారు. దీంతో శ్రీనివాసరావు చెవి, చెయ్యి భాగాల్లో తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరగుండు, అర మీసంతో వినూత్న నిరసన

డీఎంహెచ్ఓ తీరుకు నిరసనగా రోడ్డెక్కిన 104 మాజీ ఉద్యోగి


అరగుండు, అర మీసంతో శంకర్

ఇల్లెందు : ఓ అధికారి అవినీతిని బహిర్గతం చేసినందుకు తనపై కక్ష పెంచుకుని ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపిస్తూ 104 అంబులెన్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శంకర్ అరగుండు, అరమీసంతో వినూత్న నిరసన తెలిపారు. ఇల్లెందులో బుధవారం ఈ ఘటన జరిగింది. సరిపడా నిధులున్నా 104 ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుండా ఆపారని, దీనికి తోడు డీఎంహెచ్ఓ శిరీష మరో కుంభకోణానికి పాల్పడగా దాన్ని వెలికితీసి ఆ నిధులు ఆమె తిరిగి జమ చేసేలా చూశానని అన్నారు. ఆర్టీఐ చట్టం ప్రకారం ఆమె అవినీతిని వెలికితీశాననే కోపంతో తనపై కక్ష పెంచుకుని ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా పాదయాత్ర చేశానని, ఇప్పుడు అరగుండు, అరమీసంతో జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తానని పేర్కొన్నారు. త్వరలో పార్లమెంట్ ఎదుట కూడా ఆందోళన చేయనున్నట్లు వెల్లడించారు. కాగా, ఈ విషయమై డీఎంహెచ్ఓ శిరీషను వివరణ కోరగా.. శంకర్ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. డ్యూటీ చేయకుండా అధికారులను ఆర్టీఐ యాక్టు పేరుతో బెదిరిస్తుండటంతో గత కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు ఉద్యోగం నుంచి తొలగించామన్నారు. దీంతో రెండేళ్లుగా ఆందోళన పేరుతో రాద్ధాంతం చేస్తున్నాడని అన్నారు. సక్రమంగా డ్యూటీ చేయకపోవడం వల్లే విధుల నుంచి తొలగించామని స్పష్టం చేశారు.

బ్యాంక్ ఎదుట రైతుల ఆందోళన


నిరసన తెలుపుతున్న ఎన్డీ నాయకులు, రైతులు

ఇల్లెందు: గత తొమ్మిది నెలలుగా తిరుగుతున్న రుణాలు ఇవ్వడం లేదంటూ బుధవారం ఇల్లెందు యూనియన్ బ్యాంకు ఎదుట రైతులు నిరసన తెలిపారు. మండలంలోని కొమురారం, మాణిక్యారం, పోలారం గ్రామాల రైతులకు పంట రుణాల ఇవ్వకుండా తిప్పుతుండటంపై న్యూడెమోక్రసీ రాష్ట్ర జిల్లా నాయకులు ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు, రైతులు బ్యాంక్ మేనేజర్‌ను ప్రశ్నించారు. మేనేజర్ దురుసుగా సమాధానం ఇవ్వడంతో న్యూడెమోక్రసీ నాయకులు, రైతులు బ్యాంకు ఎదుట ఇల్లెందు మెయిన్ రోడ్ పై బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రులు, కలెక్టర్ స్పందించి విచారణ జరిపి రైతులకు రుణాలివ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నేతలు కొక్కు సారంగపాణి, బట్టు ప్రసాద్, హర్షా, కల్తీ సుబద్ర, కల్తీ కోటమ్మ, వినోద, శ్యామ్, మాజీ సర్పంచ్ సంతు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆరే శ్రీనివాసరావు(52) ద్విచక్రవాహనంపై చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా, అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామ శివారులోని నారాయణపురం మార్గంలో ఉన్న మూలమలుపు వద్ద ప్రమాదానికి గురై కింద పడి ఉన్నాడు. చాలాసేపటి తరువాత ఆ మార్గంలో వెళ్లే వారు గుర్తించి చిట్టితల్లి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆస్పత్రికి తరలిస్తుండగానే శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సీజ్

చర్ల: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం వైపు నుంచి వరంగల్ వైపు గంజాయితో వెళ్తున్న కారును భద్రాచలం ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆపేందుకు ప్రయత్నించారు. కారును ఆపకుండా చర్ల వైపు వేగంగా రాగా, టాస్క్‌ఫోర్స్ పోలీసుల సమాచారంతో చర్ల పోలీసులు చర్ల శివారులో కాపుకాశారు. ఈ క్రమంలో కారు దండుపేట సమీపంలోని తాలిపేరు హైలెవల్ వంతెన దాటాక కొత్తపల్లి వైపు వెళ్లింది. దారి తెలియక కొత్తపల్లిలో కారును నిలిపివేసి, కారులోఉన్న ముగ్గురు వ్యక్తులు దాక్కున్నారు. ఆ సమాచారం పోలీసులకు చేరడంతో అక్కడకు వెళ్లి కారుతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించారు. దీంతో నిందితులు, కారు, గంజాయిని కొత్తగూడెం తరలించారు. కాగా గంజాయి ఎంత స్వాధీనం చేసుకున్నారనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

టేకు కలప స్వాధీనం

చర్ల రూరల్: అక్రమంగా ట్రాలీలో తరలిస్తున్న టేకు దిమ్మెలను మండల పరిధిలోని దండుపేట ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారుజామున అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. రూ.1,30,980 విలువైన కలప తిప్పాపురం మీదుగా చర్లకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు చర్ల ఎఫ్ఆర్ఓ ఉపేంద్ర తెలిపారు.

ఏజెన్సీలో మకుటం లేని విద్యా కుసుమం

భద్రాచలంటౌన్ : విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు లిటిల్ ఫ్లవర్స్ స్కూల్, కళాశాలలు పట్టుగొమ్మల్లా ఉపకరిస్తున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గత 45 ఏళ్లుగా ఉత్తమ విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాగంటి సూర్యం స్ఫూర్తితో ప్రస్తుతం తాము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎన్నో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని ఎర్రగుంటలో మంగళవారం రాత్రి ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో వస్తున్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఎర్రగుంట గ్రామంలో, చంద్రుగొండ మండల పరిధిలోని గ్రామాల్లో చోరీలు చేసినట్లు, గతంలో ఏపీలోని గుడివాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసుల్లో జైలుకు వెళ్లివచ్చినట్లు తేలింది. వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. కారు, బైక్, రూ 1.44 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.







